'స్వాతి' వారపత్రిక - 21-03-2003

# నేను నీకు నచ్చానా?

వయసొచ్చిన తర్వాత అతి దుర్భరమైన యవ్వనాన్ని అదుపులో వుంచుకొన్న ఇరవై ఎనిమిది వసంతాల తరుణ్‌కి, ఊహతెలిసిన తర్వాత కలల్లో రాకుమారుణ్ణి ఊహించుకొని అలసిపోయిన రెండు పుష్కరాల వయసుకల ఆరతికీ, ఎదురు చూసిన ఆ శుభఘడియ తలుపు గడియ పడ్డంతో రానేవచ్చింది. క్షీరభరితమైన విదేశీథెర్మోస్ స్టీల్ గ్లాసుతో గడియపడ్డ ద్వారం దగ్గర అపర సౌందర్యదేవతలా నిలబడ్డ ఆరతిని చూడ్డంతో, తరుణ్ మనసు ముందే గాలిలో తేలిపో నారంభించింది.

ఎగిరే మనసుకి కళ్ళెం వేసి, లేచి వెళ్లి ఆరతి మరో చెయ్యి పట్టుకొని, మల్లెలు వ్రేలాడదీసిన మంచం దగ్గరకు తీసుకుపోయి కూర్చోబెట్టాడు. ఆమె చేతిలోని థెర్మోస్ గ్లాసుని తీసుకొని పక్కనే ఉన్న బల్ల మీద పెట్టి తనూ ఆమె పక్కన కూర్చుని భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా లాక్కొంటూ, "అరూ!" అన్నాడు పరవశంగా.

"ఈ అరూ ఏమిటి?" ఆరతి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"ఇకనుంచి జీవితాంతమూ నిన్ను ముద్దు ముద్దుగా పిలిచే పేరు తీరు!" అన్నాడు తరుణ్.

"అయితే నిన్ను నేను కూడా 'తరూ' అని ముద్దు ముద్దుగా పిలుస్తాను, సరేనా?" అంది ఆరతి వెంటనే.

"ఏమిటేమిటీ, నువ్వు నన్ను నువ్వూ అని సంబోధిస్తావా?! దారుణం!" అన్నాడు తరుణ్ షాక్ తిన్నవాడిలా.

"మా స్నేహితురాళ్ళందరూ వాళ్ళ వాళ్ళ మొగుళ్ళని ఏకవచనంతో సంబోధించడమే కాకుండా, అత్తమామల ఎదురుగా పేర్లు పెట్టి పిలుస్తున్నారు! ఈ మధ్య వస్తున్న నవలల్లో, సినిమాల్లో 'ఒరేయ్' అని కూడా రాస్తున్నారు. చూపిస్తున్నారు. భార్యాభర్తల మధ్య అవగాహన ముఖ్యం

కాని, నువ్వూ, మీరూ అనే అధికార, గౌరవాలు ముఖ్యం కాదు!" అంటూ క్లాసు పీకింది ఆరతి.

"సిగ్గుల మొగ్గవయి నా గుండెల్లో మొహం దాచుకొంటావనుకొన్నాను కాని ఇలా ఇంత ధైర్యంగా, ఇంతటి ఆత్మవిశ్వాసంతో మొగుడితో, అందులోనూ మొదటి రాత్రే మాటకు మాట సమాధానమిస్తావని ఊహించలేకపోయాను సుమా! ఇటీజ్ ఫెంటాస్టిక్! ఐ రియల్లీ లైకిట్!" అన్నాడు తరుణ్ ప్లేటు ఫిరాయిస్తూ.

"ఫెంటాస్టిక్ ఫెమినిజమ్! నీకిష్టమున్నా లేకున్నాసరే"

"ఇష్టమని చెప్పేశానుగా అరూ! నువ్వు నాకు బాగా నచ్చావు. మరి నేను నీకు నచ్చానా?" తరుణ్ ఆమె చెవి దగ్గరగా నోరు పెట్టి మెల్లగా అన్నాడు.

"తెల్లారి అడగవలసిన ప్రశ్నకి, తెల్లవారితేనే తెలిసే సమాధానం ఇప్పుడెలా చెప్పగలను?" ఆరతి అంది.

తరుణ్ పక్కలో బాంబు పడ్డట్లయింది. పడ్డమేమిటీ, బాంబు పక్కనే కూర్చున్నట్టనిపించింది.

మాట మారుద్దామని, "ఆ థెర్మోస్ గ్లాసులో ఉన్నది కూల్‌డ్రింకా, పాలా?" అని ప్రశ్నించాడు.

"మా గ్రాండ్‌మా స్పెషల్‌గా కాచిన 'శోరా' పాలు అంటే శోభనం రాత్రి పాలు!" అంది ఆరతి.

"అంత స్పెషాలిటీ ఏమిటో?" అడిగాడతను.

"జాజికాయా, జాపత్రీ, కుంకం పువ్వు, ఏలకులూ, మిరియాలూ అన్నీ వేసి చిక్కగా కాచిన గేదె పాలు!"

"అబ్బా! నువ్వు చెబ్తూంటేనే నోరూరుతోంది. ప్రేమగా తాగిస్తావా?" అన్నాడు కొంచెంగా మెలికలు తిరిగిపోతూ.

"నేను తాగించను. నువ్వు తాగడానికి కూడా వీలులేదు!" అని ఖండితంగా చెప్పింది ఆరతి.

"ఇదేం కండిషనూ? మొదటి రాత్రి ఒకే గ్లాసులో ఇద్దరం పాలు తాగి మురిపాలు జరుపుకోవాలి కదా?"

"అవును, నిజమే! కాని నువ్వు నాకు నచ్చడమనేది నీ సహజమయిన శక్తిసామర్థ్యాలతో కాని, ఇలా గ్రాండ్‌మా ఫార్ములా పాలు తాగి మాత్రం కాదు!" అన్నదామె.

"పోనీ ఆ పళ్ళెంలో వున్న పాలకోవా తినొచ్చా?"

"ప్రాధేయపడ్తున్నావు కాబట్టి ఒకటి తినొచ్చు. కాని మినుపసున్నుండమట్టుకు చస్తే తినకూడదు! సరేనా?"

"తినిపిస్తావన్న సరదాకొద్దీ అన్నాను కాని, నా అంతట నేను పాలకోవా కాదుకదా, అఖరికి పిప్పరమెంటు బిళ్ళ కూడా చప్పరించను! సరేనా?" అన్నాడతను.

"స్పోర్టివ్ స్పిరిట్ అంటే అలా వుండాలి!" అందామె.

"నోరంతా ఘుమఘుమలాడే కర్పూర తాంబూలం తీసుకొచ్చాను. ఇద్దరమూ చెరిసగం

కొరికి తిందాం" అంటూ కుర్తా జేబులో ఉన్న కిళ్లీ పొట్లాన్ని పైకి తీశాడు. ఆరతి వెంటనే దాన్ని తరుణ్ చేతిలోంచి విసురుగా లాగేసి, మినపసున్నుండల పళ్ళెంలో పడేసింది.

"పాన్ వేసుకొని కబుర్లు చెప్పుకుంటే మరింత తియ్యగా ఉంటాయి కదా?" తరుణ్ లాలనగా అన్నాడు.

"పాన్ వేసుకొంటే కాదు, ప్రేమనేది ఉంటే ఎలా చెప్పినా కబుర్లు తియ్యగానే ఉంటాయి. కబుర్లు ఫ్రెష్‌గా ఉండాలంటే క్లోజప్ టూత్‌పేస్టు వాడొచ్చు!"

"అంటే పాన్ వేసుకోకూడదంటావు?

"మామూలు పాన్ అయితే పర్వాలేదు. కాని నువ్వు తెచ్చింది కోటగుమ్మం దగ్గర అమ్మే 'శీరా' పాన్ కదూ? ముత్య, సువర్ణ, రజత భస్మాలు వేసి తయారు చేసింది. రెండు వందల పాతిక ఖర్చుపెట్టి తెచ్చావు కదూ పాపం? చూడు తరుణ్! బూసాన్, దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా గేమ్స్‌లో సునీతారాణి ముందంజవేసి స్వర్ణపతకం పొందింది. అలా ఏ పతకమైనా సహజమైన స్వశక్తితో గెల్చుకోవాలి. నువ్వు నాకు నచ్చడమనేదీ అలానే జరగాలి!" అంది ఆరతి మరింత కూల్‌గా.

తరుణ్ దీర్ఘాలోచనలో పడ్డాడు. శృంగార సమర సాహిత్యంలోని సూత్రాలు చక్రవాకంలో ఎండిన పత్రాలు తిరిగినట్టుగా తిరగసాగాయి. కొంతసేపటికి మస్తిష్కంలోని ఆ సుడిగాలి సద్దుకుంది. 'నిదానమే ప్రధానము' అని మనస్సు మరీ మరీ హెచ్చరించింది. పెదాల మీదకు చిరునవ్వు తెచ్చుకుంటూ, "కనీసం నీకో బహుమతి ఇవ్వడంలో అభ్యంతరంలేదు కదా?" అని ప్రశ్నించాడు.

"పూర్వకాలంలోలా, కొంగున బంగారు కాసు ముడి పెడ్తే అదే మహద్భాగ్యం అనకొంటూ, డబ్బు తీసుకొన్న గడసానిలా నటించడం నా వల్లకాదు!" రోషంగా అంది ఆరతి.

"ఉంగరాల మార్పిడితోనూ, నీ మెళ్ళో దిగేసిన బంగారంతోనూ ఆ తంతు ఎప్పుడో ముగిసింది. ఇంక బంగారం కొంగుని ముడేసే ప్రసక్తే లేదు, కొంగులోని బంగారాన్ని స్వంతం చేసుకోవడం తప్ప!"

"అమ్మో! మాటల్లో సరసం కనబడ్తోంది, పర్వాలేదు. తీసుకొన్న కట్నంలోంచి మీరు పెట్టిన బంగారం విలువ తియ్యగా మిగిలిందాన్ని నువ్వెంత న్యాయంగా సంపాదించుకొంటావో చూడాలిగా! అప్పుడే నీ ప్రశ్నకు సమాధానం లభించేది!"

"అరూ! ఇలా మాటిమాటికీ మనోవైజ్ఞానిక దబావ్‌తో నన్ను చిత్తుచేయడానికి ప్రయత్నించకు కాని, ఈ ప్రెజెంటేషన్ చూడు - ముంబయ్ అక్బరాలీస్ నుంచి తెప్పించాను" అంటూ మంచం కింద నుంచి మేకప్‌కిట్‌ని తీసి, మంచం మీద ఉంచి మూత తెరిచాడు. రకరకాల మేకప్ సామాన్లతో ఉన్న ఆ కిట్‌ని చూడగానే ఆరతి మోహం ఒక్క క్షణం వెలిగింది.

"నువ్వు నీలిరంగు చీర ధరించావు. ఈ నీలిరంగు లిప్‌స్టిక్ మేచింగ్‌గా ఉంటుంది!" అంటూ ఆ నీలిరంగు లిప్‌స్టిక్‌ని ఆమె పెదాలకి సుతారంగా రాసి, "ఇప్పుడు అద్దంలో చూసుకో,

మరింత ఆకర్షణీయంగా కనబడుతున్నావు!" అన్నాడు మాటల్లో వెన్న చిలికిస్తూ.

ఆరతి అద్దంలో ముఖం చూసుకొని మురిసిపోయింది. ఆరతి ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకొంటూ, "పాలు తాగొద్దన్నావు! మినపసున్నుండ తినొద్దన్నావు! మరి నీ అధరామృతాన్ని జుర్రుకోవచ్చా?" అని ప్రశ్నించాడు.

ఆరతి సందిగ్ధంలో పడిపోయింది. తొలిరేయి తొలి ముద్దు కోసం ఎన్ని కలలు కనిందని? మౌనంగా ఉండి పోయింది. ఆ మౌనాన్ని పూర్ణాంగీకారంగా తీసుకొని తరుణ్ మరింత ముందుకు జరిగాడు.

తొలివిజయం సాధించిన తరుణ్ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో విజృంభించాడు. మూడుసార్లు శిఖరారోహణ చేసిన మత్తులో 'నువ్వు నాకు నచ్చావు' అంది ఆరతి. 'అమ్మయ్య! పరువు నిలబడింది, థాంక్స్ సమరేశ్వరా' మనసులో అనుకొన్నాడు తరుణ్.

"ఊపిరి సలపనివ్వలేదు. బయట చిక్కటి చీకటి ఆకాశమంతా అలుముకొంది. కాస్త వరండాలో కూర్చుని ఆకాశంలో మెరిసే చుక్కల్ని చూద్దాం పద తరూ" అంటూ ఆరతి చెయ్యి పట్టుకొని తరుణ్‌ని మంచం మీద నుంచి లేవదీసింది. నిండైన వెల్తుర్లో, నిలువెత్తు అద్దంలో తన ఆకారం చూసుకొని 'కెవ్వు'మని అరవబోయి, తలుపుల బయట మనుషులు నిద్దరపోతున్నారన్న సంగతి గుర్తుకొచ్చి, గొంతుకలోనే అణచివేసుకొంది.

జుట్టూ, బొట్టూ చెదిరిపోయాయి. శరీరమంతా నఖక్షతాలూ, దంతఘాతాలూ, మెడా, చెక్కిళ్ళూ పంటిగాట్లతో ఎరుపెక్కిపోయాయి, పెదాలు వాచిపోయి నలుపు తెలుస్తోంది. తరుణ్ పరిస్థితి కూడా ఇంచుమించు అలానే వుంది. వీపంతా గోళ్ళ రక్కులతో చారికలు పడ్డాయి. "ఇప్పుడెలా?" అంది ఆరతి ఆందోళనగా. "ఇప్పుడెలా ఏమిటి?" తరుణ్ అయోమయంగా చూస్తూ ప్రశ్నించాడు.

"ఇంకో రెండు గంటల్లో తెల్లారబోతుంది, గది విడిచి బైటకెలా వెళ్ళేది? అందరి కళ్ళూ మనమీదే వుంటాయి, బుగ్గలు పొడిచేసుకొని, చెవులు కొరికేసుకొంటారు. అయినా అంత రాక్షసమా?" అందామె.

"అక్కడికి నువ్వేదో మడికట్టుకు కూర్చున్నట్టు? నన్ను మాటలతో రెచ్చగొట్టి నువ్వు చేతలతో విజృంభించావు. పర్వత శిఖరారోహణ చేసినప్పుడు ముళ్ళపొదలు గీరుకోక మానవు. సాధించిన విజయానికి ఆనందించాలేకాని సైడ్‌ఎఫెక్ట్‌కి చలించి పోరాదు".

"అవన్నీ సరేనయ్యా మహానుభావా! వంటి మీది గాట్లని బట్టల్లో దాచుకోవచ్చు చిక్కుపడిన కేశాల్ని దువ్వెనతో సరిచేసుకోవచ్చు, చెదిరిన తిలకాన్ని మళ్ళీ దిద్దుకోవచ్చు, కాని ఈ వాచిన పెదాల్నీ, దంతక్షతాలతో ఎరుపెక్కిన బుగ్గల్నీ ఎలా దాచేది? నలుగురిల్లోనూ తలెత్తుకు తిరగాలావద్దా?" అందామె.

"ఫిల్మ్‌సిటీలో హనీమూన్ ప్యాకేజి తీసుకొంటే ఈ గొడవ వుండేది కాదు. గది బయటకు అడుగుపెట్టకుండా అన్నీ అద్భుతంగా జరిగిపోయేవి. కట్నానికి అదనంగా ఖర్చని మీ వాళ్ళూ,

కట్నంలో మిగులుండదని మా వాళ్ళు పర్సులు మూసి కూర్చున్నారు" బాధగా అన్నాడు.

"అర్సరే! వాళ్ళకి బుద్ధిలేదు, మరి మన బుద్ధేమైందీ అంట? నాలుగేళ్ళ నుంచీ అయిదంకెల్లో జీతం సంపాదిస్తున్నవాడివి, ఆ మాత్రం మన డబ్బు ఖర్చు పెట్టి మధుచంద్రికా విహారానికి పోయుండొచ్చుగా?"

"ఏమిటీ, అప్పుడే మన డబ్బంటున్నావు?" తరుణ్ కాస్త ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు.

"బెల్లం, జీలకర్ర ముద్దలతో ఒకరి నెత్తిన మరొకరు చేతులు పెట్టిన క్షణం నుంచీ, నీ డబ్బేమిటి, నా డబ్బేమిటి? అంతా మన డబ్బే! ఇంతకీ తెల్లారి ఏంచేద్దామన్న సంగతి ఆలోచించలేదు" గడుసుగా అందామె.

"మన గది ఫస్ట్‌ఫ్లోర్‌లో కదా? వరండాలోంచి దుప్పటి వేలాడదీసి, కిందకు జారి, దొడ్డిగుమ్మంలోంచి బయటకు పోయి, ఏ టాక్సీలోనో మా ఊరెళ్ళిపోదాం"

"లాభం లేదు. పెళ్ళికాకమునుపు నా కోసం పాతాళభైరవి సినిమాలో తోటరాముడిలా ఎవరైనా సాహసంచేసి పైకివస్తారన్న భయంతో మా నాన్న పెర్మనెంట్ గ్రిల్ పెట్టించేశాడు" అని విచారంగా చెప్పింది ఆరతి.

"అంటే...?" తరుణ్ అర్థోక్తిగా ఆగిపోయాడు.

"అందమైన ఆడపిల్లలన్న తర్వాత అనేక భ్రమరాలు వెంటబడ్తాయి. అయినా నేనెటువంటిదాన్నో మన తొలి కలయికలో నీకు తెలుసుండాలే?" పౌరుషంగా అందామె.

"ఛ! ఛ! ఆ విషయంలో కాదు. మా ఇంటి వరండాకి కూడా గ్రిల్ పెట్టించాలి కదా అని..." నసిగాడతను.

"అంటే నా మీద నీకు నమ్మకం లేదన్నమాట?"

"కాదు, మనకి పుట్టబోయే అమ్మాయిని ఆకతాయి వెధవల్నుండి రక్షించడానికి!" అన్నాడతను.

"మాట మార్చడంలో ఘనుడవే కాని, ముందు జరగాల్సిన సంగతి గురించి ఆలోచించు" అంది ఆరతి.

"గప్‌చిప్‌గా తలుపు తీసుకొని బయటికి వెళ్ళిపోదాం. అందరూ గాఢమైన నిద్రలో వుంటారు"

"లాభంలేదు, అందరూ తొలిరాత్రి జరిగిన తర్వాత, శోభనం పెళ్ళికూతురు మొహంలోని సిగ్గుతెరల్ని చూడ్డం కోసం పత్తికాయలంత కళ్ళేసుకొని ఎదురు చూస్తూంటారు. గది బైట గడియ వేసి మా అమ్మమ్మ తన మంచం గుమ్మాని కడ్డంగా వేసుకొని పడుకొంటుంది"

"ఏమిటీ, మళ్ళీ చెప్పు" అన్నాడు తరుణ్.

"మా ఇంట్లో ఈ గదిలో ఎన్నో శోభనాలు జరిగాయి. ఆకతాయి పిల్లలు చెవులాన్చి వినకుండా, కంతల్లోంచి చూడకుండా, గుమ్మాని కడ్డంగా మంచం వేసుకొని పడుకొంటుంది మా అమ్మమ్మ" అని చెప్పింది.

"హతోస్మి! సెక్యూరిటీ గార్డు గార్డెన్‌లో స్టెన్‌గన్ పట్టుకొని పహారా కాస్తుంటే, భయంతో భార్యతో (అవాలని లేదు) కాపురంచేసే వి.ఐ.పి. జీవితంలా మన శోభనం జరిగిందన్నమాట.

నాకు ముందే తెలుసుంటే సైకలాజికల్‌గా ముందంజ వెయ్యలేకపోయేవాణ్ని, అప్పుడు పైకి అనకపోయినా, 'నువ్వు నాకు నచ్చలేదు' అనుకొనేదానివి"

"దొంగమాటలు నేను ఛస్తే చెప్పను. ఉన్నమాట దాచను. ఇంతకీ ఉపాయం ఏమిటీ?"

"ఒకటే మార్గం బైటకు అడుగు పెట్టకపోవడమే"

"మరీ ఇంత యావా అని నాలుక కోసేసుకొంటారు"

తరుణ్ మరి మాట్లాడకుండా దుస్తులు వేసుకొన్నాడు. బట్టలు కట్టుకో అని సైగచేశాడు. ఆరతీ అలానే చేసి జుట్టూ, బొట్టూ సవరించుకొంది. తరుణ్ వెళ్ళి తలుపు గడియ తీసి లాగి చూశాడు. రాలేదు. తలుపు మీద తట్టాడు.

"ఎవరదీ?" అంటూ ముసిలావిడ లేచింది. మాట్లాడమన్నట్టుగా ఆరతికి సైగ చేశాడు తరుణ్.

"నేనమ్మమ్మా! ఓసారి తలుపు తీస్తావా" అంది ఆరతి.

బైట గడియ తీస్తున్నచప్పుడు వినగానే, తరుణ్ లైట్‌స్విచ్ ఆఫ్ చేసి, గోడ పక్కగా వెళ్ళినిల్చున్నాడు.

"అమ్మమ్మా! తనకిక్కడ మీ అందరి మధ్యా చాలా ఇబ్బందిగా వుందట. ఇప్పుడే వాళ్ళ ఊరు వెళ్ళిపోదామంటున్నాడు" ఆరతి ఓ అందమైన అబద్ధం చెప్పింది.

"అంతా సవ్యంగా జరిగిందా, లేక గొడ్వవేమైనాపడ్డారా? నువ్వు నోటి దురుసు మనిషివి" అంది ముసలావిడ.

"నేనింక కన్యని కాదులే. నీకా బెంగ అక్కర్లేదు కాని, ఎవ్వరూ లేకవముందే ఇక్కడ్నించి వెళ్ళాలి"

"నాతల్లే! అప్పుడే మొగుడంటే ఎంత మోజో?" అంటూ అప్యాయంగా మనవరాలి ముఖం తడిమింది. వాచిన పెదాలు చేతికి తగలడంతో ముసలావిడకి అంతా అర్థమైపోయింది.

"సంతోషం! నేను కాచి ఇచ్చిన పాలు దివ్యంగా పనిచేశాయన్నమాట. ఈ తియ్యటి బాధల జ్ఞాపకాలే మిమ్మల్ని చిరకాలం దగ్గరగా వుంచుతాయి. చప్పుడు చెయ్యకుండా వెళ్ళండి" అంది.

బ్రతుకుజీవుడా అనుకొంటూ, ఓ చిన్న బ్రీఫ్‌కేసు తీసుకొని ఇద్దరూ బైటపడ్డారు. అమ్మమ్మ సెంటిమెంటుని హర్ట్ చెయ్యడం ఇష్టంలేక, ఆరతి థెర్మోస్‌ని కూడా పట్టుకెళ్ళింది.

సందు మొదట్లో, చీకట్లో ఆటో రిక్షాలో పడుకొన్న డ్రైవర్ని లేపి, "టాక్సీ స్టాండ్‌కి వెళ్ళాలి" అన్నాడు తరుణ్.

డ్రైవరు బద్ధకంగాలేచి, ఫ్రంట్ సీట్లోకి వెళ్ళికూర్చుని, "పాతిక రూపాయల వుతుంది" అన్నాడు.

"అలాగే" అని తరుణ్ ఆటో ఎక్కాడు. చీరకొంగుతో ముసుగు వేసుకొన్న ఆరతి ఆతురతతో ఆటో ఎక్కి, తరుణ్ పక్కన కూర్చుంది.

'పది రూపాయల దూరానికి పాతికన్నా బేరమాడకుండా ఎక్కేశారు. ఇదేదో మాయజేసి ముంబయ్‌కి స్త్రీలని తీసుకుపోయే వ్యవహారంలా వుంది. ఎందుకైనా మంచిది' అనుకొంటూ డ్రైవరు అటోని పోలీసు స్టేషన్ వైపు పరుగులెత్తించాడు. ✿